పోస్టల్ బ్యాలెట్లకు సీల్

ప్రజాశక్తి-నెల్లూరు

పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ లో ఉంచి సీలు వేశారు. శుక్రవారం పోస్ట్ లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్లను పోస్టల్ సిబ్బంది కలెక్టరేట్లో కలెక్టర్ ఎం హరి నారాయణన్ కు అందజేశారు. ఈ పోస్టల్ బ్యాలెట్ లను ట్రంక్ పెట్టెలో భద్రపరిచి సీలు వేశారు. అనంతరం స్ట్రాంగ్ రూములో బాక్సులను ఉంచి స్ట్రాంగ్ రూమ్ కు తాళాలు వేసి సీలు వేశారు. సీల్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతకం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద రిజిష్టర్ లో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి డిఆర్ఓ బాపిరెడ్డి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి విద్యాధర్, టిడిపి ప్రతినిధి కష్ణ చైతన్య పాల్గొన్నారు.



అభ్యర్థులది ధీమా..నేతలది టెన్షన్..!

గ్రామీణ ఓటర్లపై వైసిపి ఆశలు - పెరిగిన ఓట్లు తమవేనని టిడిపి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా, అభ్యర్థులు, నేతలు, కార్యకర్తల్లో మాత్రం టెన్షన్ తగ్గడం లేదు..తమ గెలుపు కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన వైసిపి, టిడిపి నేతలు తమదే గెలుపు అనే ధీమాలో ఉన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీకోసం పనిచేశామని చెప్పిన నేతల్లో మాత్రం టెన్షన్ తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంత ఓటర్లు, మహిళలు తమవైపే ఉన్నారని, వైసిపి నేతలు భావిస్తున్నారు. భారీగా పెరిగిన ఓట్లు, పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారిలో ఎక్కువ భాగం తమవారని టిడిపినేతలు ధీమాగా ఉన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొమ్మిది తమవేనని వైసిపి నేతలు చెబుతున్నారు. ఏడు స్థానాలు తమవేనని టిడిపి నేతలంటున్నారు.


పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)


ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు పోలింగ్ సరళిపై పోస్టుమార్టం చేస్తున్నారు. వైసిపి, టిడిపి నేతలు మాత్రం గెలుపుపై ధీమాతోనే ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంపై కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన నేతల ఓట్లు తమకే ఓటు వేశారని చెప్పుకుంటున్నారు. ఓటర్లకు నగదు ఇవ్వడం తోపాటు, ఇరుపార్టీల అభ్యర్థి నేతలు, కార్యకర్తలకు పెద్ద మొత్తంలో సాయం అందించారని తెలుస్తోంది. బాగా పనిచేయాలని నేతలు, కార్యకర్తలను నమ్ముకున్న నేతలు గ్రామీణ ప్రాంతాల నేతలు తమదే గెలుపని అభ్యర్థులకు చెప్పారు. ఇప్పుడు ఓటర్లు ఎవరికి ఓట్లు వేశారో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఫలితాల్లో ఏం జరుగుతుందో తెలియని గ్రామీణ ప్రాంత నేతలు అంటున్నారు. టిడిపి నేతలు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏడు స్థానాలు వస్తాయని భావిస్తున్నారు. భారీగా ఓట్ల శాతం పెరగడం, విదేశాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో 80 శాతం టిడిపికి అనుకూలమైన ఓటర్లు అని పార్టీ నేతలు చెబుతున్నారు. పోస్టల్ బ్యాలెట్, ఉద్యోగులు, వ్యాపారులు, యువత మార్పు కోరుకున్నారని టిడిపి నేతలు చెబుతున్నారు. జిల్లాకు సుమారు 25 వేల మంది జిల్లాకు వచ్చారని తెలుస్తోంది. ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మంది బెంగుళూరు, చెన్నయ్, హైదరాబాద్, విదేశాల నుంచి వచ్చినట్లు సమాచారం. కొందరు యువకులు అమెరికా నుంచి ఓటు వేయడానికి వచ్చారని తెలిసింది. ఈ మార్పు టిడిపినేతలకు ధీమా కలిగి స్తోంది. ఏ మేరకు ఎంత వరకు సాగిందో చూడాలి. వైసిపి నేతల ధీమా వారిదిగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ పెరిగింది . మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓట్లు వేశారు. సుమారు 80 శాతం పోలింగ్ జరిగింది.కందుకూరు, ఉదయగిరి, సర్వేపల్లిలో 83 శాతం పోలింగ్ జరిగింది. ప్రభుత్వ పథకాలు తీసుకున్న గ్రామీణ ఓటర్లు వైసిపి వైపు ఉన్నారని ఆపార్టీనేతలంటున్నారు. వారిలోనూ ధీమా తగ్గడం లేదు. కొందరు తమ మెజార్టీ చెబుతున్నారు. టిడిపి, వైసిపి నేతలు తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. విశాఖపట్నంలో సిఎంగా జగన్మోహన్రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని వైసిపి నేతలు, అమరావతిలో చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని టిడిపి నేతలు చెబుతున్నారు. ఈ ప్రకటనలతో ఓటర్లు, సాధారణ జనం విస్మయం చెందుతున్నారు. జిల్లాలో ఎక్కడ నలుగురు ఉన్నా ఎన్నికల ఫలితాల విషయమై చర్చిస్తున్నారు. ఉత్కంఠ కొనసాగుతోంది.కొందరు నేతలు లెక్కలు చూస్తున్నారు జిల్లా చరిత్ర ఇంతలి ఎన్నికలు జరగలేదని, మరోసారి జరిగినా ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు. పోలింగ్ ముగిసిన ఫలితాలపై ఇరుపార్టీల అభ్యర్థులు, నేతలు తీవ్ర ఉత్కంఠంలో ఉన్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

ఈవిఎంల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి నెల్లూరు

నగరంలో పోల్డ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికలఅధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలెక్టర్లు, ఎస్ పి లతో స్ట్రాంగ్ స్ట్రాంగ్ రూములకు భద్రత రక్షణ కౌంటింగ్ కేంద్రాల సౌకర్యాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోల్డ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని ఆయన చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. స్ట్రాంగ్ రూములను కలెక్టర్, ఎస్ పి ప్రతిరోజు సందర్శించాలన్నారు. రాష్ట్రంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బం దులు లేకుండా అన్నిరకాల భద్రత చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. హరినారాయణన్, జిల్లా ఎస్.పి అరిఫ్ హఫీస్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల ఉన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పి


ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రిన్సిపల్‌కు సత్కారం

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య సి.హెచ్ విజయను వారి చాంబర్‌లో బోధన, బోధనేతర సిబ్బంది కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ప్రిన్సిపల్ గా ఇచ్చిన అవకాశానికి ముందుగా ధన్యవాదాలు తెలిపారు.న్యాక్ ఏ గ్రేడును దృష్టిలో ఉంచుకొని మనమందరం కలిసికట్టుగా పని చేసి విశ్వవిద్యాలయ భవిష్యత్తు మరెన్నో ఉన్నతమైన కీర్తి ప్రతిష్టలను తీసుకురావాలని కోరారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు : ఎస్పి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి "పోలీస్ వెల్ఫేర్ డే" నిర్వహిస్తున్నట్లు ఎస్పి కె.ఆరీఫ్‌హఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పి కార్యాల యంలో నిర్వహించిన పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నిత్యం విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సంక్షేమానికి నిత్యం కషి చేస్తామన్నారు. అదే సమయంలో పోలీసు సిబ్బంది విధినిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహించాలని, అనధి కారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. డిపిఓ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు జారీ చేయ డంతోపాటు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుండి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యు టేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్యం కారణంగా బదలాయింపు సం బంధిత అపరి ష్కతంగా ఉన్న సమస్యలకు అర్జీలను స్వీకరించారు. పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరి ష్కతంగా ఉన్న పనులను తక్షణమే పరి ష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్క రించేలా చర్యలు తీసు కుంటామని భరోసా ఇచ్చారు.


మాట్లాడుతున్న ఎస్పి

పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు

శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏళ్ల తరబడి తుప్పు పట్టిన పైప్ లైన్లనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తుప్పు పట్టిన పైప్ లైన్‌లు లీకై పక్కనే ఉన్న రొయ్యల చెరువులు బూడిద యాష్ లతో నిండిపోతున్నాయని తెలిపారు. పైపులు లీకై యాష్ మొత్తం రొయ్యల చెరువుల్లో కలుషితమైనందున రొయ్యల చెరువులోని రొయ్యలన్నీ మృతిచెందుతున్నాయన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఏపీ జెన్కో యాజమాన్యం వారు వెంటనే ఆదుకుని నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ స్పందించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా తిరుపతి జిల్లా బిఎన్. కండ్రిగ మండలం ఎంపిపిఎస్ చిన్నె గుంట పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సుమన్‌రావు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఎలక్షన్ విధులు మినహాయింపు కోరిన అధికారులు స్పందిచకపోవడం దారుణమని యుటిఎఫ్ జిల్లా కమిటీ పేర్కొంది. జిల్లా యుటిఎఫ్ కమిటీ ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల విధులకు మినహాయింపు లేని కారణంగా విధులకు హాజరై విధులు నిర్వహిస్తూ సదరు ఉపాధ్యాయుడు తీవ్ర అనారోగ్యానికి గురికావడం వల్ల స్పహ తప్పాడన్నారు. ఎన్నికల విధులు నిర్వహణ మధ్యలో దగ్గర ఉపాధ్యాయుడిని వైద్యశాలకి చేర్చడం, అనారోగ్య తీవ్రతను బట్టి నగరంలోని అపోలో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం కోసం చేర్పించా రన్నారు. ఉపాధ్యాయుడు తీవ్ర అనారోగ్యంతో ఆ ఉపాధ్యాయుడు కోమాలోకి వెళ్లార న్నారు. వారి కుటుంబం చాలా నిరుపేద కుటుంబమన్నారు. ప్రభుత్వ విధులు నిర్వహ ణలో అనారోగ్యానికి గురైన కారణంగా ఉపాధ్యాయుడి వైద్య ఖర్చులకోసం తిరుపతి జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి స్పందించి తగు ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన కోరుతున్నామని తెలిపారు.


ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై ఉక్కు పాదం..

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

పర్యావరణ పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన నిషేధిత కాలుష్య కారక ప్రమాణాలను నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో కఠినంగా అమలు చేస్తున్నామని, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఉక్కు పాదం మోపుతూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ తెలియజేశారు.నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై స్థానిక స్టోన్ హౌస్ పేట ప్రాంతంలోని పలు దుకాణాల్లో శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. వివిధ దుకాణాల నుంచి రెండు టన్నుల నిషేధిత ప్లాస్టిక్‌ను జప్తు చేసుకుని దుకాణాల నిర్వాహకులకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయాలపై సమీప సచివాలయం లేదా కార్పొరేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. కాలుష్య కారకమైన ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్క వినియోగ దారుడూ బాధ్యతగా వ్యవహరిస్తూ, వస్తువులను తెచ్చుకు నేందుకు తమ వెంట జౌళి, నార, గుడ్డ సంచులను మాత్రమే ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్ వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అక్రమాలు చేసినా విజయం మాదే..!

మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎన్నికల అక్రమాలు చేసినా కూటమిదే విజయమని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.శుక్రవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు తన సోదరుటు మాజీ ఎంఎల్ఎ ఆనం వివేకానందరెడ్డి పేరుతో నిర్మించిన సమావేశ మందిరాన్ని ఆపార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొంతమంది అధికారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో పాటు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఊడిగం చేశారన్నారు. పోలింగ్ జరిగిన అనంతరం జరుగుతోన్న హింస ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడు చూడలేదన్నారు. ఎన్నికల సమయంలో దేశ చరిత్రలో ఇంతమంది ఐఎఎస్‌లు,, ఐపిఎస్ లు, అధికారులు సస్పెన్షన్‌కు గురికావడం ఇదే తొలిశారన్నారు. ఎన్నికల తర్వాత కూడా వైసిపి శ్రేణులు దాడులకు తెగబడ్డారన్నారు. తమకు ఓటు వేయలేదని రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. ఆత్మకూరులోని మర్రిపాడు మండలంలో మేకపాటి కుటుం బీకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. మర్రిపాడు మండలం లోని ఒకటి నుంచి పది బూత్‌లకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం సరైన బందోబస్తు ఏర్పాటు చేయలేదన్నారు. నాటు బాంబుల సంస్కృతి కలిగిన మర్రిపాడు మండలంలో కేవలం ఒక ఎన్‌సిసి క్యాడెట్, మహిళా కానిస్టేబుల్‌ను మాత్రమే భద్రత పరంగా విధులకు కేటాయించాలని, ఈ విషయాన్ని గుంటూరు రేంజి ఐజి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మర్రిపాడు మండలంలోని అన్ని బూత్‌లకు సంబంధించి తమ ఏజెంట్లను అప్రమత్తం చేసి సుమారు రెండు నుంచి మూడు వేల ఓట్లు దొంగ ఓట్లు పడకుండా చూడగలిగామన్నారు. చివరకు మేకపాటి రాజమోహన్ రెడ్డి సతీమణి కూడా ఒక పోలింగ్ బూత్‌లో నిబంధనలకు విరుద్ధంగా తిష్ట వేసి ఓటర్లను ప్రభావితం చేసిందన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆత్మకూరులో విజయం తమదేనన్నారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. వైసిపి నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని సర్వేలు కూటమికి అనుకూలంగా ఉండడంతో జగన్‌మోహన్‌రెడ్డి నాటకం అడుతున్నారన్నారు. తమ నేతల్లో ధైర్యం కాకి లెక్కలు చెబుతున్నారన్నారు. తమ కోసం పనిచేసిన అధికారులకు కృతజ్ఞతుల చెప్పకుండా తనకు పని చేసిన సర్వే టీంతో జగన్మోహన్ రెడ్డి తీసుకున్న సెల్ఫీ చివరిదన్నారు. రాష్ట్రంలో మంచి మెజార్టీతో పార్టీ అధికారంలో వస్తుందన్నారు. ఆత్మకూరులో తాను మంచి మెజార్టీతో గెలుస్తున్నాని ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే యూకే వెళ్లిపోయాడని ఆయన ఎప్పుడు వస్తారో కూడా తెలియదన్నారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జూన్ 4న వెలువడే ఫలితాల్లో ఆత్మకూరులో పసుపు జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మాజీ ఎంఎల్ఎలు కొమ్మి లక్ష్మీయ్యానాయుడు, కంభం విజయరామిరెడ్డి, టిడిపి నేతలు బ్రహ్మారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆనం రంగ మయూర్‌రెడ్డి, ఆనం శుభకర్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : రక్తపోటు అత్యంత ప్రమాదకరమని, ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకోవడం.. కోపాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, ఊభకాయాన్ని తగ్గించుకోవడం ద్వారా..శారీరక శ్రమ.. వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రిం చడం సులభతరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం. పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించారు. రక్తపోటును ఖచ్చితంగా కొలవాలని.. దానిని నియంత్రించడం ద్వారా జీవితకాలం పెరుగుతుందని అనే నినాదాలతో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అడిషినల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు ఖాదర్‌వల్లి మాట్లాడుతూ రక్తపోటు సమస్య ఉన్న వారు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎటువంటి ఆహారపదార్థాలు తీసుకోవాలి, ముందస్తుగా గుర్తించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ఎన్‌సిడి , ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టరు ఎన్.వి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ అధిక రక్తపోటును ప్రారంభ దశలో గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా భావిం చవచ్చున్నారు. బి.పి వల్ల గుండెకు సంబంధించిన వ్యాధులు, మెదడుకు సంబంధించిన సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా పక్షవాతం సంభవించవచ్చున్నారు. ఎన్‌సిడి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

కూటమి అభ్యర్థుల విజయం ఖాయం : జనసేన

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని జనసేన సీనియర్ నాయకులు పోతురాజు టోనీ బాబు పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 29 నుంచి పవన్ కళ్యాణ్ అభిమానులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభిం చారన్నారు. ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించే విధంగా టిడిపి, జనసేన, బిజెపి అభిమానులు ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి వైసిపి వైఫల్యాలను, రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరించి చైతన్య పరిచిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యావాదాలు తెలుపు తున్నామన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతో దూర ప్రాంతాలైన హైదరాబాదు, బెంగళూరు, చెన్నయ్ ప్రాంతాల నుంచి నగరానికి విచ్చేసి ఓటింగ్‌లో పాల్గొనికూటమి అభ్యర్థులకు ఓట్లు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ 50 నుంచి 70 వేల మధ్య ఓట్ల మెజారిటీ వస్తుం దన్నారు. మే 12వ తేదీ అర్ధరాత్రి వెంకటగిరిలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటాన్ని ఖండిస్తూ దీని మీద చర్య తీసు కోవాలని అధికారులకు పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేస్తు న్నామన్నారు. ఈ నెల 20న చలో వెంకటగిరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన సీని యర్ నాయకులు ఎస్.కె షానవాజ్, చెరుకూరు సుబ్బు, శ్రావణ్, షఫీహారన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కానిస్టేబుల్‌కు అస్వస్థత

ప్రజాశక్తి-నెల్లూరు : కలెక్టరేట్‌లో విధి నిర్వహణ కోసం వచ్చిన కానిస్టేబుల్ మల్లిఖార్జున రావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఒక్కసారిగా అనారోగ్యానికి గురికావడంతో కలెక్టరేట్ లో డ్యూటీలో వున్న హెడ్ కానిస్టేబుల్,ఆర్మ్డ్ గార్డ్ అక్కడ వున్న కలక్టరేట్ సిబ్బంది తక్షణమే స్పందించి 108కు సమాచారం అందజేశారు. వైద్యచికిత్సల నిమిత్తం కానిస్టేబుల్ మల్లికార్జునను ఆస్పత్రికి తరలించారు.

ఓట్ల లెక్కింపుపై అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి నెల్లూరు

ఓట్ల లెక్కింపు కు అన్ని విధాల సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ప్రణాళిక రూపొందిం చుకోవాలని, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు లో ఉంటుందన్నారు., ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి చెక్ పోస్టుల వద్ద టీం లను కొనసాగించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉంచాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల భద్ర పరిచే టప్పుడు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉండే విధంగా చూడాలన్నారు. ఈనెల 28 లోగా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్ఓలకు తెలియజేయాలని, ఈ సమాచారాన్ని రాజకీయ పార్టీలకు సత్వరమే తెలపాలన్నారు. ప్రియదర్శిని కళాశాలలో స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ టీవీలు ఏర్పాటు చేశామని, అక్కడ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా రోజూ పరిశీలించుకోవచ్చున్నారు. ఎన్నికల అనంతరం ఎలాంటి సంఘటనలు జరగకుండా అవసరమైన చోట పికెటింగ్ ఏర్పాటు చేయా లన్నారు. నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవ వాహనాలు వితరణ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు పంచాయతీ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శేష వాహనం, హంస, హనుమంతు, గరుడ, ఏనుగు, గుర్రం వాహనాలకు సంబంధించిన ఇత్తడి వాహనాలను గ్రామానికి చెందిన దాతలు బహూకరించారు. ఈ సందర్భంగా దాతల సమక్షంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఆలయ చైర్మన్ సమక్షంలో ఉత్సవ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని కార్య నిర్వహణ అధికారి దర్గయ్య తెలియజేశారు. కార్యక్రమంలో కె.గోవర్ధన్ గిరి గౌడ్, ఎం.మల్లికార్జున, గాదిరాజు రాజేష్, గాదిరాజు వెంకటరమణయ్య, శాంతి దంపతులు, గాదిరాజు శ్రీనివాసరావు, విద్యుల్లత, జగన్మోహన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్మీ ఉద్యోగుల ఓట్లు నమోదు

ప్రజాశక్తి-కందుకూరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ కొనసాగుతూనే ఉంది. కందుకూరు అసెంబ్లీ ప్రాంతానికి సంబంధించిన ఆర్మీ ఉద్యోగులు ఎవరైతే ఉన్నారో వారు ఓట్లను పోస్టుల ద్వారా కందుకూరు ఎన్నికల అధికారికి పంపించారు. అందులో భాగంగాశుక్రవారం 13 మంది ఆర్మీ అధికారులు, ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆర్మీ అధికారుల ఉద్యోగుల ఓట్లు 66 నమోదు కాగా ఇప్పటివరకు 16 మాత్రమే పోలైనవి. మిగిలిన ఓట్లు పోలింగ్ చేసుకొనుటకు జూన్ 4 ఉదయం 8 గంటల వరకు అవకాశం ఉన్నదని ఎన్నికలు నిర్వహణ అధికారులు తెలియ జేస్తున్నారు. అందులో భాగంగా కందుకూరు ఆర్‌డిఒ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన రికార్డు రూమ్‌లో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోస్టుల ఓట్లను భద్రపరిచారు.ఈ ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీ ఎన్నికల ఏజెంట్లు , సంబంధిత పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న బిఎల్ఓలు

బిఎల్ఓల నిరసన

ప్రజాశక్తి వలేటివారిపాలెం
13వ తేదీన జరిగిన ఎన్నికల సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సిబ్బందికి అన్ని ఏర్పాట్లు తాము చేశామని అందుకు రూ.13వేలు ఖర్చు అయిందని బిఎల్ఓలు తెలిపారు. అందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన నిధులను తమకు ఇవ్వాలని శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డిమాండ్ చేశారు. తాము ఎంతో నిబంధనలతో విధులు నిర్వహించినప్పటికీ తమకు ఇవ్వాల్సిన నగదును ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ఈ విషయమై ఎంపిడిఒ తోట వెంకటకృష్ణ కుమారిని వివరణ కోరగా.. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేసిన బిఎల్ఓలకు నగదును చెల్లించి అక్విటేషన్ కూడా తీసుకోవడం జరిగిందన్నారు. వారికి రావాల్సిన రెన్యూమరేషన్ ఆర్ఒ వారి ఖాతాలో జమ చేస్తారని తెలిపారు.

మెజారిటీతో కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు

ప్రజాశక్తి-కావలి

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) కావలి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలవ బోతున్నారని కావలి ఆర్యవైశ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్యులు కావలి టిడిపి కార్యాలయంలో కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. జూన్ 4న రానున్న ఫలితాల్లో భారీ మెజారిటీ సాధించడం ఖాయమని, నాయకులు, కార్యకర్తలు ఆ దిశగా కృషి చేయడం జరిగింద న్నారు. క్రిష్ణారెడ్డి ఈ సందర్భంగా ఆర్యవైశ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

వరికి బదులుగా ఆరుతడి పంటలు వేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సోమశిల ప్రాజెక్టులో సాగనీరు కొరత ఉన్న ప్రస్తుత నేపథ్యంలో రైతులు రెండో పంట కింద వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్షాలు రాక సోమశిల ప్రాజెక్ట్ సాగునీరు అందక బోర్ల ద్వారా సాగునీరు చేపట్టడం భూగర్భ జలాల తగ్గి తాగే నీటికి కూడా ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరిలో ఒక ఎకరాకు సరిపడా మీరు ఐదు నుండి ఏడు ఎకరాల వరకు ఆరుతడి పంటలకు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో వరి నాటడం ద్వారా పంట ఎండిపోవడంతో కాండం కుళ్ల తెగులు సల్ఫైడ్ ఇంజూరి మొదలగు సమస్యల వల్ల పంట దెబ్బతినడంతో పాటు దిగుబడులు నామమాత్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నెలలో రైతులు ఆరుతడి పంట లైన వేరుశనగ, నువ్వు పంటలు వేసుకోవచ్చని తెలిపారు. కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకొని వేరుశనగ రకాలైన టిఎజి-24 లేదా కదిరి లేపాక్షి1813 గానీ నువ్వు రకాలైనగౌరీ వైఎల్‌ఎం -66 రకాలను రైతులు ప్రస్తుతం విత్తుకోవచ్చన్నారు. అలాగే వచ్చే నెలలో వేరుశెనగ, నువ్వు పంటలతో పాటుగా వర్షాధారంగా మినుము లేదా పెసర పంటలను రైతులు వేసుకోవచ్చని తెలిపారు. పల్లంకు తెగులు తట్టుకునే పెసర రకాలైన ఐపిఎం2-14 డబ్ల్యుజిజి-42, ఎల్‌జిజి-574 రకాలు మినుము రకాలైన టిబిజి-104 పియు 31, ఎల్‌బిజి 752 రకాలు రైతులు ప్రస్తుతం సాగు వర్షాధారంగా జొన్న, సజ్జ పంటలు కూడా రైతులకు నికర ఆదాయాన్ని అందిస్తాయి. మొక్కజొన్న సజ్జ పంటలలో అనేక ప్రయివేటు హైబ్రిడ్‌లు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ మూడు పంటలు రైతులు జూన్ 15వ తేదీపై నుండి విత్తుకోవచ్చన్నారు. పచ్చిరొట్ట డైైన జీలుగా, జనము, పిల్లి పెసర విత్తనాలు 50శాతం సబ్సిడీతో అందించేందుకు వీలుంటుందని వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు తెలియజేశారు.

20న ఉచిత ఖత్నాలు

ప్రజాశక్తి-ఉదయగిరి
20వ తేదీ సోమవారం ఉదయగిరిలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణంలో ఉచిత కఖత్నాలు నిర్వహించనున్నట్లు రహతులీల్ అలా మీన్ ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలంలో ఉన్న ముస్లింలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-కావలి

రానున్న ఎన్నికల లెక్కింపు వరకు పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కావలి ఒకటో పట్టణ పోలీసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో టిడిపి వైసిపి తదితర పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో పట్టణ సి.ఐ. రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం కౌంటింగ్‌కు ముందు గానీ, తరువాతగానీ పట్టణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం 20మంది స్పెషల్ ఫోర్స్‌ను ఉన్నతాధికారులు పంపించి ఉన్నారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో కావలి మానస హాలు సెంటర్‌లో, పాతూరు కృష్ణుడి బొమ్మ సెంటర్లో, మరియు జడ్.పి. గ్రౌండ్ వద్ద కావలి 1వ పట్టణ పోలీస్ సిబ్బందితో పికెట్ నియమించి, సదరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు ఎస్.ఐ. స్థాయి అధికారులతో నిరంతరం గస్తీ నిర్వహించబడునని తెలిపారు.

రామస్వామిపాలెంలో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాథరావు పేట పంచాయతీ రామస్వామిపాళెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం వైద్యులు నిత్య ప్రశాంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వనాథరావు పేట పంచాయతీ సర్పంచ్ గండూరి మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదవారి కోసం ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి వైద్యం అందించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. బిపి, షుగరు, థైరాయిడ్ అనారోగ్య సమస్యలకు పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది రోజ్లిన్, అమృత, సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, కృష్ణమూర్తి, విశ్వనాథరావుపేట-2 పంచాయతీ కార్యదర్శి చైతన్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవ కార్యక్రమం కావలి పట్టణ వెంగళరావు నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య నివాసం సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. వార్డు ఇన్‌ఛార్జ్ శానం హరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య, టిడిపి నాయకులు నాయుడు రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ బిట్రగుంట శివప్రసాద్ కుమార్, దేవరకొండ శ్రీనివాసులు, ఆల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

ప్రజాశక్తి-కావలి
కావలి పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులను తక్షణం నిషేధించాలని మున్సిపల్ అధికారులను విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద కోరారు. పట్టణ మంతా ఎటుచూసినా నిషేధిత ప్లాస్టిక్, కవర్లు, సీసాలు, ఒకసారివాడి, విసిరేయగా దర్శనమిస్తున్నాయన్నారు. కూరగాయలకు, పండ్లు, సరుకులు ఏవి కొనడానికి పోయేప్పుడైనా ఒక గుడ్డ సంచి తీసుకుని పోయే అలవాటు ప్రజలకు పూర్తిగా పోయిందన్నారు. ఏం కొనాలన్నా వట్టి చేతులతో పోయి, నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో కావాల్సిన వస్తువులు తెచ్చుకుంటూ, కవర్లను వాడిపారేస్తున్నారు. అవి మురుగు కాలువల్లో మురుగునీరు పారకుండా అడ్డుపడగా కాలువల్లోని మురికి రోడ్లపైకి వస్తూ కనిపిస్తున్నాయన్నారు. దుర్గంధం, ఈగలు దోమల పెరుగుదల, అంటు వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నా యన్నారు. మూగ జీవాలు ఆ కవర్లను తిని జబ్బులపాలై, చచ్చిపోతున్నాయన్నారు. డెంగీ వ్యాధి వ్యాపిస్తున్నదనే వార్త వినబడుతున్నా అధికారుల్లో ఉదాసీనత కనబడుతుందన్నారు. టిఫిన్ సెంటర్లు, కర్రీస్ పాయింట్స్ వద్ద టిఫిన్స్, కర్రీస్ ప్లాస్టిక్ కవర్లతో ప్యాక్ చేస్తున్నారు. ముఖ్యంగా వేడివేడి కూరలను ప్లాస్టిక్ కవర్లలో వేసిస్తే వినియోగదారులు ఏమాత్రం విచక్షణ లేకుండా తీసుకువెళ్తున్నారు. కేన్సర్ కారకాలైన పదార్థాలు ప్లాస్టిక్ కవర్ల నుండి కరిగి ఆహార పదార్థాల్లో కలిసిపోతూ వినియోగదారులను జబ్బుల పాలు చేస్తున్నాయన్నారు. కావలి పట్టణంలో ఎటుచూసినా ఈ ప్లాస్టిక్ భూతమేనన్నారు. ప్రజలు మేలుకోవాలి.. అధికారులు ఉపేక్షిస్తూ కూర్చోక కఠిన నిర్ణయాలతో తగు చర్యలు తీసుకుని ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై తక్షణం నిషేధాజ్ఞలు ఇచ్చి, ఆకస్మిక తనిఖీలు చేసి, కూరగాయ మార్కెట్, టిఫిన్ సెంటర్లు, కరీస్ పాయింట్స్ వారికి హెచ్చరికలు చేసి, జరిమానాలు విధిస్తూ ప్రజానీకాన్ని కాపాడాలని కోరుతున్నామన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం

విద్యార్థులను చేర్పించాలని కోరుతున్న లక్ష్మీప్రసన్న

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రవేశాలకుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా శుక్రవారం హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు బట్రెడ్డి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలోని ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పై ప్రచారం చేశారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఈ విద్యా సంవత్సరం నుంచి అనంతసాగరం ఉన్నత పాఠశాలలో ఎంపిసి, సిఇసి గ్రూపులు ప్రారంభించామని విద్యార్థులను ఇంటర్లో చేర్చాలని ఆమె కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్యా బోధన నేర్పిస్తారని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, ఎస్‌కె ఖాజామొహిద్దీన్, కేత శ్రీనివాసులు రెడ్డి, ఎస్.కె.మహమ్మద్ భాషా, ఎస్‌కె కరీం, సలదిన్, తదితరులు పాల్గొన్నారు.


హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదకరంగా ఉన్న మలుపులు

మలుపులు ప్రమాదానికి పిలుపులు

ప్రజాశక్తి-మర్రిపాడు
మండలంలో కొన్ని గ్రామాలలో అంతర్గత రహదారులపై ప్రయాణం కొనసాగించాలంటేనే దడపుడుతుంది. రోడ్ల పక్కనే ప్రమాదకరమైన వ్యవసాయ బావులు, మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మలుపులు ఉన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాల ఆచూకీ తెలియక ప్రమాదాలు జరుగుతాయని భయాందోళన చెందుతున్నారు. చుంచులూరు నుండి పడమటినాయుడు పల్లికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు కేతమన్నేరు వాగువద్ద అత్యంత ప్రమాదకరమైన మలుపు ఉంది. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రయాణీకులు గ్రామస్తులు మండిపడుతున్నారు. పడమటి నాయుడుపల్లి దర్గా సమీపంలో చెంబుడు బావి దగ్గర రోడ్డుకు ఆనుకొని ప్రమాదకరంగా బావి ఉంది. ఒకే సారి రెండు వాహనాలు వచ్చినట్లయితే వాహనాలు ప్రక్కకు తొలగినట్లైతే ఇక అంతే సంగతులు. ఆర్ అండ్ బి రోడ్ పక్కల ప్రమాదకరమైన బావి ఉన్న హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం దారుణమన్నారు. ఈ గ్రామం నుండి జాతీయ రహదారి వెళ్లాలంటే కనిపించని మలుపులు చాలానే ఉన్నాయి. మలుపుల వద్ద ప్రయాణికులు మృత్యువాత పడుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తిక్కవరం గ్రామ సమీపంలో ఎత్తు పల్లముగా యు ఆకారంలో ఉండి రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల గతంలో వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. ఇలా ప్రమాదాలకు నిలయాలుగా ఉన్న వ్యవసాయ బావులు, మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పింఛన్‌లు బ్యాంకుల్లో వేయొద్దు..

- దళిత సంఘర్షణ సమితి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

వృద్ధులు, దివ్యాంగుల పింఛన్‌లు బ్యాంకుల్లో వేయవద్దు అని ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి అర్జీరూపంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టులో వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా కావలిలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి విలేకరులతో మాట్లా డుతూ జూన్ 1వ తేదీన వృద్ధులు, దివ్యాంగుల ఫించన్‌లు బ్యాంక్‌లకు వేసి సామాజిక ఫించన్ దారులను ఇబ్బంది పెట్టారని తెలిపారు. 75శాతం బ్యాంక్‌ల నుండి ఫించన్ పొందలేద న్నారు. బ్యాంక్‌ల్లో ఫించన్ వేయడం వల్ల ఎప్పుడో 7సంవత్సరాల క్రితం అకౌంట్‌లు ఓపెన్ చేసి ట్రాన్సాక్షన్స్ జరపకపోవడం వలన వృద్ధులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఫించన్ కోసం నడి ఎండలో చిత్రహింసలకు గురయ్యారని తెలిపారు. బ్యాంక్‌లో సరైన అమౌంట్ లేదని, కెవిపి చేయించాలని, ఆధార్, పాన్ కార్డులు కావాలని అనేక ఇబ్బందు లకు గురిచేశారని తెలిపారు. బ్యాంక్‌ల నియమాలు పాటించాల ంటే ఒక్కరికి కూడా పించన్ రాదన్నారు. నడి ఎండలో చిత్ర హింసలు పెట్టారని తెలిపారు. బ్యాంక్‌ల చుట్టూ తిరిగినా ఇప్పటి వరకు ఫించన్ ఇవ్వలేదన్నారు. చాలామంది కూడా మరణించారని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కి, ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని పోస్టు ద్వారా పంపించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 1వ తేదీ ఇచ్చే సామాజిక ఫించన్‌లు బ్యాంక్‌ల ద్వారా వేయకుండా సచివాలయ ఉద్యోగస్తులు 12మంది ఉన్నారన్నారు కాబట్టి వారి ద్వారా పంపిణీ చేయాలని తెలిపారు. బ్యాంక్‌ల్లో వేసిన డబ్బును ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. రూ.1300 కోట్లలో రూ.800కోట్ల బ్యాంక్‌లు జమ చేసుకొన్నాయన్నారు. బ్యాంక్‌లపై చర్యలు తీసుకోవాలని, వృద్ధాప్య పింఛన్‌లు గతంలో ఇచ్చిన విధంగానే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇవ్వాలని తెలియజేశారు. 25వ తేదీన నుండి వృద్ధులకు మద్దతుగా ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ముక్కు మోహన్‌రావు, జెడ్డా వాసు, తిరుపతి, జాఫరన జాని బాషా పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

హెచ్‌ఎంకు సూచనలు చేస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

మాసాయిపేట ఎంపిపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.అనురాధను ఎంఇఒ-1 మస్తాన్‌వలీ అభినందించారు. శుక్రవారం మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మాసాయిపేట మెయిన్ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించిన టాయిలెట్స్‌లోని టైల్స్, వాష్ బేసిన్స్, డోర్స్ చాలా చక్కగా అందంగా బియించి తయారు చేశారని ప్రధానోపాధ్యాయ రాలు జి అనురాధను ఆయన అభినందించారు. ముఖ్యంగా కాంపౌండ్ వాల్ చివరి దశ పనులల్లో ఈ స్థలం తమది అని గ్రామస్తులు అడ్డుకోవడంతో తహశీల్దార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తామని గ్రామస్తులకు ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. అలాగే మనబడి నాడు-నేడు పనులలో నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యత త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పూర్తయిన కాంక్రీట్ పనులకు, కాంపౌండ్ వాల్ పనులకు ప్రతిరోజు వాటర్‌తో క్యూరింగ్ చేయాలని మండల సూచనలు చేశారు.


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన గేదె

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
తెగిపడిన విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురైన గేదె మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చౌటభీమవరం గ్రామంలో శుక్రవారం కోళ్లమూడి హాజర్తయ్య అనే రైతుకు చెందిన గేదెను పొలానికి మేతకు తోలుకు వెళ్లారు. గురువారం వచ్చిన గాలి, వానకు మోటార్ వద్ద విద్యుత్ తీగలు తెగిపడి ఉన్న విషయం తెలియక పశువులు ఆ వైపు వెళ్లాయి. కింద పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాకుతో గేదె అక్కడి కాక్కడే పడి మృతి చెందినదని బాధితుడు వాపోయాడు. తీగలు గురువారం నాటి గాలివానకు తెగి పడిన విషయం గ్రామస్తులు విద్యుత్ అధికారు లకు తెలిపిన వారు పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. తీగలు సరిచేసి ఉంటే గేదె మృతి చెందేది కాదని తెలిపారు. గేదె విలువ రూ.80వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరుతున్నారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

19న 'పది' విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-కావలి
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 19వ తేదీన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేస్తున్నట్లు జెవివి నాయకులు తెలిపారు. పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన "కావలి పట్టణ జెవివి విస్తృత కార్యవర్గ సమావేశం" నిర్వహించారు. జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ.రవికుమార్, అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా కావలి పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు గానూ ఆదివారం ఉదయం 9 గంటలకు రవి నర్సింగ్ హోమ్‌లో ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి సహజ పానీయమైన మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. 28వతేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు కావలి పట్టణంలోని బిపిఎస్ సెంటర్ వద్ద "కూల్ డ్రింక్స్ వద్దు-సహజ పానీయాలు ముద్దు" అనే అంశంపై కావలి పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సంబంధిత కరపత్రాలను పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ మూడు విషయాలను కావలి జన విజ్ఞాన వేదిక పట్టణ కమిటీ తీర్మానించి షెడ్యూల్‌ను విడుదల చేయడం జరిగింది. సమావేశంలో జె.వి.వి. ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి.హరినాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, జె.వి.వి. జిల్లా కార్యద ర్శులు పాపిశెట్టి.జానకిరామ్, జి.కళ్యాణి, వేములపాటి.మాధవ, ఉపాధ్యక్షులు సి.కల్లయ్య, గుణకల.శివయ్య, సంయుక్త కార్యదర్శులు సిహెచ్. శారద, షేక్.ఖాదర్ బాషా, కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎన్.ప్రసాద్‌రావు, ఎం.మాలకొండా రెడ్డి, అమిరిశెట్టి.హజరత్తయ్య, షేక్.జమీర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెవివి నాయకులు


అరుణాచలంకు ప్రత్యేక సర్వీస్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
23తేదీ పౌర్ణమి సందర్భంగా (కార్తీక సోమవారం) 22వ, తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు (సర్వీస్ నెంబర్ 94320)ను ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నిసా తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్స్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. టికెట్ ధర రాను.. పోను.. రూ.1400లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అరుణాచలం వెళ్ళు ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. సందర్శించు ప్రదేశాలు కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదర్శనం, దర్శనం పూర్తి సమాచారం కోసం డిఎం ఆత్మకూరు 9959225645, సిఐ ఆత్మకూరు 9966009395, డి వి సుబ్బయ్య కండక్టర్ 8555929504 కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.


చిన్నపాటి వర్షానికే రాళ్లు తేలిన రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదాలు..

ప్రజాశక్తి-ఉదయగిరి
అధ్వానంగా మారిన రోడ్డు మార్జిన్‌లు ఇటీవల కురిసిన వర్షానికి మరింతగా గుంతలమయంగా దర్శనమిస్తూ ప్రయాణాలు ప్రాణాంతకంగా మారాయి. ఉదయగిరి నుంచి నెల్లూరు, గండిపాలెం, సీతారామపురం కొండక్రింద గ్రామ ప్రాంతాలకు వెళ్లే రహదారుల మార్జిన్‌లు గుంతలతో ప్రాణాంతకంగా మారాయి. పొరపాటున వాహనాల రోడ్డు దిగితే బోల్తా పడే పరిస్థితి ఎదురవుతోందని వాహనదారులు ప్రయాణికులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షానికి మరింత లోతుగా రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకొని పోవటం వల్ల




వాహనాలు ఎదురు పడినపుడు రోడ్డు దిగలేని పరిస్థితులు నెలకొనడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వెళ్తున్న ఎదురుగా వాహనం వస్తే ఆగిపోయే పరిస్థితి ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లు సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యలకు నిలయాలుగా కాలనీలు

- అభివృద్ధికి ఆమడ దూరంలో పల్లెలు
- రోడ్లను కమ్మేసిన కంపచెట్లు

ప్రజాశక్తి-మర్రిపాడు
మండలంలో కొన్ని కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఎస్‌సి కాలనీలో అంతర్గత రహదారులు కంపచెట్లతో కుచించుకు పోయాయి. కాలనీలో డ్రెయినేజీలు మురుగు నీటితో నిండి ఎటు పోయేందుకు వీలులేక రోడ్లపై పారుతున్నాయి. దాని వల్ల దోమలు అధికమై రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దాంతో కాలనీ వాసులు సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారు. అధికారులు, పాలకులు అంతర్గత రహదారులు గురించి పట్టించుకోలేదు. చిన మాచనూరు ఎస్‌టి కాలనీలో ఉండాల్సిన అంతర్గత రోడ్లు, ఇళ్ల చుట్టూ ముల్లచెట్లు, పిచ్చి మొక్కలతో రోడ్లను కమ్మేయడం వల్ల కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో సరిగా వీధి దీపాలు వెలుగక విష సర్పాల భయంతో ఇంటి నుండి బయటకు రావాలంటేనే హడలి పోతున్నారు. ఈ కాలనీలవాసులంతా కూలి పనులపై జీవనం సాగిస్తున్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైనా ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేదు. కాలనీ వాసులను పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు అంటున్నారు.

ఎస్‌టి కాలనీలో 15కుటుంబాలు వారుండగా చేతిపంపు ఒక్కటే ఉండడంవల్ల, అందులో ఫ్లోరిన్ అధికంగా ఉందన్నారు. అధికారులు స్పందించి కాలనీలలో కంపచెట్లను తొలగించి, వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీనీ శుభ్రం చేసి మురుగునీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రోడ్డు కానరాక ఏపుగా పెరిగిన కంపచెట్లు

వైసిపి విజయం తథ్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని పున్నూరు గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నూరు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పసుగణాభివృద్ధి సంస్థ చైర్మెన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు ఒక వరం లాంటిదని తెలిపారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్య, వైద్యంపై ప్రత్యక శ్రద్ధ జగన్‌మోహన్ రెడ్డి దృష్టి పెట్టారన్నారు. కార్యక్రమంలో మైపాడు వైద్యశాల డాక్టర్ విజయ శంకర్, గొల్లపల్లి అవినాష్, కష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైసిపి నాయకుల్లో జోష్..

ప్రజాశక్తి-అనంతసాగరం
ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం విజయవాడలో ఐపాడ్ సిబ్బందితో మాట్లాడిన సందర్భంగా రాష్ట్రంలో వైసిపి రెండోసారి అధికారంలో రావడం ఖాయమని 2019 ఎన్నికల్లో 151 సీట్లు వస్తే 2024లో అంతకుమించి సీట్లు వస్తాయని ప్రకటన చేయడంతో మండలంలోని వైసిపి నాయకుల్లో జోష్ కనిపించింది. తమ నాయకుడే ప్రకటన చేయడంపై నాయకులు ముఖాలలో ఆనందం వెల్లివిరిసినది. జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని వైసిపి నాయకులు అన్నారు.